సాక్షి
మంచిర్యాల
శుక్రవారం ౹ 1 ౹ మార్చి ౹ 2024



కడెం..డెడ్‌స్టోరేజీ
నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో సుమారు 68వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే కడెం ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరువలో ఉంది. కాలువల ద్వారా సాగునీరందని పరిస్థితి నెలకొంది. 8లో▸



సమస్యల 'పోస్ట్'
ఉమ్మడి జిల్లాలోని పోస్టాఫీసులు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె భవనాల్లో బ్రాంచ్ పోస్టాఫీసులు కొనసాగుతున్నాయి. ఉద్యోగుల క్వార్టర్లు అధ్వానంగా మారాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /23.0

వాతావరణం
ఉదయం వేళ ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

- విక్రయాలపై నిఘా ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ బి.సంతోష్


జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాల అగ్రికల్చర్: మత్తుపదార్థాలు, మద్యపానీయాల వినియోగం యువత భవిష్యత్‌కు నిరోధకమని, వాటికి దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు, అబ్కారీ, మద్యపాన నిషేధ శాఖ పర్యవేక్షకులు నందగో పాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందనలతో కలిసి జిల్లా విద్య, వైద్య, అటవీ, వ్యవసాయ, సాంఘిక, ఆదాయ పన్ను, రెవెన్యూ శాఖల అధికారులు, జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లతో మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు కాకుండా వ్యవసాయ, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా మత్తు పదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని, పట్టణ ప్రాంతాలు, కాలనీలు, పాఠశాలలు, హోటళ్లు, విక్రయ ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలో మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందని, ఇందుకోసం పల్స్‌పోలియో కేంద్రాల ఏర్పాటుతోపాటు కార్యక్రమ నిర్వహణ కోసం సూపర్‌వైజర్లు, మొబైల్ బృందాలను నియమించామని తెలిపారు. జిల్లాలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, వివిధ కూడళ్లలో వ్యాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 3న వ్యాక్సినేషన్ కాని పిల్లల కోసం 4, 5వ తేదీల్లో ఇంటింటిని సందర్శించి పిల్లలకు వ్యాక్సిన్‌ను అందిస్తామని తెలిపారు. మార్చి 3న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పల్స్ పోలియో కేంద్రాలు నిర్వహిస్తామని, వ్యాక్సిన్ తీసుకున్న పిల్లల ఎడమ చేయి చిటికెన వేలుకు గుర్తు పెడతారని తెలిపారు.

నర్సరీల్లో మొక్కలు కాపాడాలి


భీమారంలో నర్సరీని పరిశీలిస్తున్న చిన్నయ్య, ఎంపీడీవో రాధ

భీమారం: గ్రామ పంచాయతీల ద్వారా హరిత హారం కింద నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండల నుంచి కాపాడాలని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని మొక్కల నర్సరీతోపాటు ప్రకృతివనాన్ని సందర్శించారు. వర్షాకాలంలో ప్రజలకు ఉచితంగా అందించేందుకు గ్రామ పంచాయతీల ద్వారా మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. వేసవి ఎండలు ఇప్పటి నుంచే ప్రారంభమయ్యాయని, ఎండల నుంచి నుంచి రక్షించేందుకు గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యదర్శులు ప్రతీరోజు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధ పాల్గొన్నారు.


హాల్‌టికెట్ నంబర్లు పరిశీలిస్తున్న విద్యార్థులు

నిరుద్యోగుల్లో ఆనందం

- డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- జిల్లాలో 288 ఉపాధ్యాయ పోస్టులు


గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు

మంచిర్యాలఅర్బన్: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉపాధ్యాయ నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు రెట్టింపు అయ్యాయి. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ప్రకటించారు. గత ఏడాది శాసనసభ ఎన్నికల నేపథ్యంలో డీఎస్సీ, నవంబర్ 20 నుంచి 30వరకు జరగాల్సిన పరీక్షలు వాయిదా పడడం నిరుద్యోగుల్లో నిరాశ నింపింది. ప్రభుత్వ పాఠశాలల్లో 473 ఖాళీలు ఉండగా ఇందులో 113 పోస్టులను ఖాళీ చూపడంపై అప్పట్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఏళ్ల తరబడి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడింది. విద్యావాలంటీర్లు లేకపోవడం, చదువులకు ఆటంకం కలుగకుండా ఉపాధ్యాయుల సర్దుబాటుతో నెట్టుకొస్తున్నారు. 2017 తర్వాత ఉపాధ్యాయ నియామకాలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు తాజాగా మెగా డీఎస్సీ ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

గతంలో ఇలా..

తాజాగా ప్రకటించిన డీఎస్సీతో జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు పెరిగాయి. వాయిదా పడిన డీఎస్సీలో విద్యాశాఖ ప్రకటించిన ప్రకారం జిల్లాలో 113 ఖాళీలు చూపారు. స్కూల్ అసిస్టెంట్ 36, భాషా పండితులు 16, వ్యాయామ ఉపాధ్యాయులు 3, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 58 పోస్టులు ఖాళీగా చూపడంపై పెదవి విరిశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో జిల్లాలో 288 పోస్టులు భర్తీ కానున్నాయి. ఈ లెక్కన పోస్టులు రెట్టింపు కావడం నిరుద్యోగులకు వరంగా మారింది.

ఇంటికి దూరంగా ఉంటూ..

శిక్షణ కోసం నెలల తరబడి ఇంటికి దూరంగా ఉంటూ చదువుతున్న వారిలో గత ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నిరుత్సాహపర్చింది. కోచింగ్‌కు వెళ్లడం వల్ల ఆర్థికంగా భారం పడింది. గ్రంథాలయ బాట పట్టి పుస్తక పఠనం చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తమైంది. మరోవైపు ఖాళీలు తక్కువ చూపినా డీఎస్సీ ప్రకటన వచ్చిందనే సంతోషం కూడా వాయిదాతో ఆవిరైంది. ఇప్పటికే పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో బోధనకు ఆటంకాలు ఏర్పడ్డాయి. వచ్చే విద్యాసంవత్సరం నాటికి కొత్త ఉపాధ్యాయులు బడిబాట పడితే సమస్యలు తొలగనున్నాయి.

జిల్లాలో 288 ఖాళీలు

జిల్లావ్యాప్తంగా 288 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఈ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రభుత్వం ప్రకటించింది. లాంగ్వేజ్ పండిట్ పోస్టులు 16, పీఈటీ 13, స్కూల్‌అసిస్టెంట్ 75, ఎస్జీటీ 194 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ గణితం 11, ఫిజికల్‌సైన్స్ 1(తెలుగుమీడియం), ఫిజికల్ సైన్స్(ఉర్దు) 1, ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, బయోసైన్స్ 14(తెలుగు), బయోసైన్స్(ఉర్దు) 1, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిస్ 5, స్కూల్ అసిస్టెంట్ హిందీ 6, స్కూల్ అసిస్టెంట్ తెలుగు 5, సోషల్(తెలుగు మీడియం) 25, సోషల్(ఉర్దు) 1, ఎల్‌పీ తెలుగు 8, ఎల్‌పీ హిందీ 6, ఎల్‌పీ ఉర్దు 2, పీఈటీ 3, ఎస్జీటీ 176, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ 18, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ 5 పోస్టులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలు..

జిల్లా	స్కూల్ అసిస్టెంట్	లాంగ్వేజ్ పండిత్	పీఈటీ	ఎస్జీటీ	స్కూల్ అసిస్టెంట్(ప్రత్యేక)	ఎస్జీటీ (ప్రత్యేక)	మొత్తం
నిర్మల్	70	04	04	236	05	23	342
ఆదిలాబాద్	74	14	02	209	06	19	324
మంచిర్యాల	70	16	03	176	05	18	288
కుమురంభీంఆసిఫాబాద్	62	25	02	234	03	15	341



పోస్టులు పెరిగాయి..



గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు పెరిగాయి. టీటీసీ పూర్తి చేసి గ్రంథాలయంలో ప్రిపరేషన్ అవుతున్నా. ఆటోలో వచ్చి వెళ్లేందుకు ఆర్థికంగా భారం పడుతోంది. గత డీఎస్సీ రద్దు కావడంతో కొంత మేర ఇబ్బందులు పడినా తాజా డీఎస్సీ వేయడం.. పోస్టులు పెరగడం సంతోషంగా ఉంది. – సాయిప్రియ, నస్పూర్

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా..



చాలా ఏళ్లుగా గ్రంథాలయంలో చదువుకుంటూ ఉపాధ్యాయ, ఉద్యోగాలకు ఎదురు చూస్తున్న. గ్రూపు–1 పరీక్ష తేదీ ముందుగా ప్రకటించడంతో ఆ దిశగా నిరుద్యోగులు చదువుతున్నారు. గ్రూపు పరీక్షకు, డీఎస్సీ పరీక్షల తేదీలకు ఆటంకం లేకుండా ప్రకటిస్తే బాగుంటుంది. డీఎస్సీ వాయిదా పడకుండా సజావుగా సాగేలా చూడాలి. – స్వరూప, మంచిర్యాల

లాంగ్‌టర్మ్ కోచింగ్



ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలు ఎప్పుడు వాయిదా వేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. 2016లో ఓసారి డీఎస్సీ పరీక్ష రాసి మిస్సాయ్యాను. అప్పటి నుంచి కోచింగ్ తీసుకుంటున్నా. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా దూర ప్రాంతాలకు వెళ్లి కోచింగ్ పొందలేని పరిస్థితి. నాలాంటి వాళ్లకు లాంగ్‌టర్మ్ పుస్తక పఠనం చేయడానికి గ్రంథాలయం దోహద పడుతున్నాయి. జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు పెరగడం సంతోషకరం. మరిన్ని పోస్టులు పెంచితే బాగుండేది. – హరి, ఇందారం

సరిహద్దు ప్రాంతాలపై నిరంతర నిఘా

- రామగుండం సీపీ శ్రీనివాసులు
- డ్రోన్‌కెమెరాలతో పరిసరాల పరిశీలన


డ్రోన్‌కెమెరాతో పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ

కోటపల్లి: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత నది పరీవాహక ప్రాంతాల్లో పోలీసుల నిఘా నిరంతరంగా ఉంటుందని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. గురువారం కోటపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంచపల్లి, అర్జునగుట్ట, ప్రాణహిత సరిహద్దు ప్రాంతాలను డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్‌తో కలిసి సందర్శించారు. నాటుపడవల యజమానులు, చేపలు పట్టే వారితో సీపీ శ్రీనివాసులు మాట్లాడి అక్కడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలు, మావోయిస్టుల కదలికలపై గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ యువత బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం, ఇతర ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉండాలని, సంఘ విద్రోహశక్తులకు సహకరించవద్దని, భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై తెలుసుకునేందుకు డ్రోన్ పెట్రోలింగ్ నిర్వహించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో నిఘా ఏర్పాటు చేశామని, ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ సీఐ రవీందర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో నమూనా ఎన్నికలు నిర్వహించాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో నమూనా ఎన్నికలు నిర్వహించాలని డీఈవో యాదయ్య తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొనాలని పేర్కొన్నారు. నమూనా ఎన్నికలు మార్చి 5లోపు పూర్తి చేసి సంబంధిత షార్ట్ వీడియోస్, ఫొటోలు, రిపోర్టులను డీఈవో కార్యాలయం ఈ మెయిల్ deomncl@gmail.comకు పంపించాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులతోపాటు అందుబాటులో ఉన్న ఆర్ట్ టీచర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, పర్యావరణ జిల్లా కో–ఆర్డినేటర్ యోగేశ్వర్లును సంప్రదించాలని తెలిపారు.

ప్రాణాలకు విలువేది?



జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రి వద్ద పోలీసుల బందోబస్తు

- చికిత్సకు వస్తే గాల్లో కలుస్తున్న ఆయువు
- ప్రాణనష్టం జరిగితే పైసలతో సెటిల్మెంట్లు
- కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో పట్టు తప్పుతున్న వైద్యం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే రోగుల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది. జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలిసిన, ప్రైవేటు ఆస్పత్రుల్లో చాలా చోట్ల నాణ్యమైన వైద్యం అందక మృత్యువాత పడాల్సి వస్తోంది. ఇటీవల జిల్లాలో చోటు చేసుకుంటున్న వరుస ఘటనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. సర్కారు దవాఖానాల్లో సరైన సదుపాయాలు లేక పేద, మధ్యతరగతి ప్రజలు చాలామంది ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. అక్కడ చికిత్స పేరుతో రూ.లక్షలు ఖర్చు చేసినా ఒక్కోసారి రోగుల ప్రాణాలకు భరోసా ఉండడం లేదు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాలు కూడా లెక్క చేయని స్థితిలో వైద్యవ్యాపారం సాగుతోందంటే అతిశయోక్తి కాదు.

ఆపదలో ఆసుపత్రికి వెళ్తే..

జిల్లాతోపాటు మహారాష్ట్ర, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలకు మంచిర్యాల పట్టణం వైద్యానికి కేంద్రంగా ఉంది. ఈ డిమాండ్‌ను గుర్తించే 'కరోనా'కు ముందు నుంచే అడ్డగోలుగా ఆస్పత్రులు వెలిశాయి. ఇప్పటికీ కొన్నింటికి అనుమతులు లేవు. అర్హతలకు మించి సేవలు ఇస్తామని ప్రచారం చేసుకుంటున్నవీ ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వెళ్లలేక మొదట ఇక్కడే చికిత్స పొందుతున్నారు. ముందుగా సంతకాలు చేయించుకున్నాకే చికిత్స అందిస్తున్నారు. వైద్యరంగంలో లేని వ్యక్తులు చేరి ధనార్జనే ధ్యేయంగా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, ఇసుక, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంలో ప్రారంభిస్తున్నారు. ఆసుపత్రుల మధ్య పోటీతో ఆర్ఎంపీలు, పీఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లు, హెల్త్ సిబ్బంది, రిఫరల్ కింద చేర్చుకుని కమీషన్లు ఇస్తున్నారు. ఇక కొందరు ప్రభుత్వ వైద్యులే సొంతంగా ప్రాక్టీసు చేస్తున్నారు.

ప్రాణాలకు పైసలతో వెల

ఆసుపత్రుల్లో చనిపోతే బాధిత కుటుంబాలకు పరిహారం కింద సెటిల్మెంట్ చేసుకుంటూ యాజమాన్యాలు చేతులు దులిపేసుకుంటున్నాయి. ఒక్కోసారి పరిస్థితి తీవ్రమైతే తప్ప చర్యలు ఉండడం లేదు. ఇటీవల జరిగిన ఘటనల్లో ఎంతో కొంత అప్పజెప్పి ఎక్కడా కేసులు లేకుండా చూసుకుంటున్నారు. గతంలో అటవీశాఖ ఉద్యోగిని థైరాయిడ్ శస్త్రచికిత్స కోసం వెళ్తే ఏకంగా ప్రాణాలు కోల్పోవడంతో ఆ ఆసుపత్రిని సీజ్ చేశారు. ఆ తర్వాత అలాంటి చర్యలేవీ తీసుకోలేదు. ఎక్కడా గొడవలు బయటకు రాకుండా డబ్బులు చేతిలో పెట్టి ప్రాణాలకు పైసలతో వెలకడుతున్నారు.

ఫిర్యాదు ఇస్తే విచారణ

జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో మహిళ మృతిపై మాకు ఫిర్యాదు రాలేదు. కుటుంబీకులు ఎవరైనా ఫిర్యాదు ఇస్తే ప్రాథమికంగా విచారణ చేపట్టి నివేదిక అందిస్తాం. చెన్నూరు ప్రైవేటు ఆసుపత్రిలో బాలింత మృతిపై ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే విచారణ చేశాం.
– జి.సి.సుబ్బారాయుడు, జిల్లా వైద్యారోగ్య అధికారి

ఆందోళన కలిగిస్తున్న మరణాలు

తాజాగా చెన్నూరు పట్టణానికి చెందిన జోడు మధునక్క(45)కు జిల్లా కేంద్రంలోని శ్రీనివాస నర్సింగ్ హోమ్‌లో గర్భ సంచిలో గడ్డలు తొలగించేందుకు ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేశాక పరిస్థితి విషమించి చనిపోయింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆందోళన చేయగా, పోలీసులు వచ్చారు. దీనిపై ఆసుపత్రి వైద్యులు మాత్రం తమ నిర్లక్ష్యం లేదని, ముందు నుంచే ఆమె పరిస్థితి తీవ్రతరంగా ఉందని తెలిపారు. మృతురాలి కుటుంబానికి రూ.6లక్షలకు పరిహారం ఇచ్చి ఆసుపత్రి చేతులు దులిపేసుకున్నట్లు సమాచారం.

- ఈ నెల 19న చెన్నూరు పట్టణంలో శ్రీకిరణ్ ప్రసూతి, సర్జికల్ నర్సింగ్ హోం ఆసుపత్రిలో మహారాష్ట్రలోని సిరొంచా కార్సువెల్లికి చెందిన రాపెల్లి మంగ ప్రసవించాక చనిపోయింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. ఆమె మృతదేహం అప్పగించడం లోనూ హైడ్రామా జరిగింది. ఇక్కడ ప్రభుత్వ వైద్యురాలు అరుణశ్రీ ప్రైవేటుగా పని చేస్తున్నారు. ఆసుపత్రి నిర్వాహకులు రూ.6.50లక్షల వరకు పరిహారం ఇచ్చినట్లు సమాచారం.
- ప్రసాద్ ఆస్పత్రిలో గత డిసెంబర్ 6న హాజీపూర్ మండలం టీకానపల్లికి చెందిన మేడం రమ్య(23) గర్భసంచికి గడ్డలు ఉన్నాయని ఆపరేషన్ చేశారు. చికిత్సలో యువతి పరిస్థితి విషమించి చనిపోయింది. వైద్యులు సరిగా చికిత్స అందించలేదని కుటుంబసభ్యులు, బంధువులు ధర్నా చేశారు.

బడిలోనే ఉపాధ్యాయుడి మద్యపానం

- పట్టపగలే మిత్రుడితో కలిసి..
- ఉపాధ్యాయ వృత్తికి కళంకం


ఉపాధ్యాయుడు రాజు కాంబ్లే

బెల్లంపల్లిరూరల్: విద్యార్థులకు ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయుడు పట్టపగలే పాఠశాలలో మద్యం సేవిస్తూ వృత్తికే కళంకం తెచ్చాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధి చర్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది. పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో చెట్ల నీడన పాఠాల బోధన సాగుతోంది. ఇక్కడి ఉపాధ్యాయురాలు సునంద అనారోగ్యంతో గత మూడు రోజులుగా సెలవులో ఉంది. దీంతో దుగ్నెపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాజు కాంబ్లేను చర్లపల్లిలో విధులు నిర్వర్తించాలని అధికారులు ఆదేశించారు. మూడో రోజు గురువారం దుగ్నెపల్లి గ్రామానికి చెందిన ధనుంజయ్ అనే యువకుడు పాఠశాలకు వచ్చాడు. ఇద్దరూ కలిసి పాఠశాల వెనుకాల మద్యం సేవించారు. గమనించిన కొందరు గ్రామస్తులు సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. పాఠశాలలో మద్యపానంపై ఉపాధ్యాయుడిని నిలదీశారు. ఈ విషయమై ఎంఈవో మహేశ్వర్‌రెడ్డిని సంప్రదించగా.. డీఈవోకు నివేదిక పంపినట్లు తెలిపారు. కాగా, రాజు కాంబ్లే కొన్ని నెలల క్రితం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో దుగ్నెపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మూసివేతకు గురైంది.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

బెల్లంపల్లి: పట్టపగలు బడిలో మద్యం సేవించిన ఉపాధ్యాయుడిపై వేటు పడింది. ఎస్జీటీ రాజు వ్యవహారంపై ఎంఈవో విచారణ జరిపి అందజేసిన నివేదిక మేరకు డీఈవో యాదయ్య అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో మద్యం తాగిన ఘటనపై విచారణ చేపడతామని పేర్కొన్నారు.

ఐసీడీఎస్ మహిళా అధికారి అరెస్టు

- పిల్లలకు సరఫరా చేసే పాలు మళ్లించిన వైనం
- రూ.65.78 లక్షల అవినీతి జరిగినట్లు నిర్ధారణ

సాక్షి, ఆసిఫాబాద్: చిన్నారులకు సరఫరా చేయాల్సిన పాలు, పాల ప్యాకెట్లను దారి మళ్లించిన ఐసీడీఎస్ అధికారి అనిసెట్టి శ్రీదేవిని ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జైనూర్ మండలంలో 2015– 16 మధ్య ఐసీడీఎస్ విభాగంలో సీడీపీవోగా పనిచేసిన శ్రీదేవి.. పిల్లల కోసం కేటాయించిన పాలు, పాల ప్యాకెట్లు దారి మళ్లించినట్లు అప్పట్లో అధికారులు గుర్తించారు. శాఖాపరమైన విచారణలో 322 అంగన్‌వాడీ కేంద్రాల్లోని గిరిజన పిల్లల కోసం సరఫరా చేయాల్సిన పాలు, పాల ప్యాకెట్లను ఆమె మంచిర్యాల పరిధిలోని చాక్లెట్, ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీలకు తరలించి సొమ్ము చేసుకున్నట్లు తేలింది. ఆ కుంభకోణాన్ని వెలికితీసే బాధ్యతను ఏసీబీ(కరీంనగర్)కి అప్పగించారు. విచారణ జరిపిన అధికారులు ఆమె అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారించారు.

క్రిమినల్ కేసు నమోదు

అనిసెట్టి శ్రీదేవి రూ.65.78 లక్షల అవినీతికి పాల్పడినట్లు విచారణలో తేలింది. 2022లోనే విచారణ పూర్తి చేసిన ఏసీబీ అధికారులు ఆమె అరెస్టుకు అనుమతి ఇవ్వాలంటూ అప్పటి ప్రభుత్వాన్ని కోరగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం అందుకు నిరాకరించడంతో కేసు పురోగతి ఆగిపోయింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఏసీబీ అధికారులు ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కుంభకోణంలో అప్పటి జిల్లా మంత్రి జోగు రామన్న ముఖ్య అనుచరుడి హస్తం ఉన్నట్లు ప్రచారం జరిగింది.

ఇంటర్ పరీక్షలకు 96.25 శాతం హాజరు


విద్యార్థులను తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 25 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు 96.25 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. మంచిర్యాల అంధ విద్యార్థి స్క్రైబ్ సహాయంతో పరీక్ష రాశారు. మొత్తం 6,664 మంది విద్యార్థులకు గాను 6,414 మంది హాజరు కాగా, 250 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ 5,545 మందికి గాను 5,332 మంది హాజరు కాగా, 213 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,119 మందికి 1082 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. మంచిర్యాలలో ఓ పరీక్ష కేంద్రాన్ని డీఐఈవో శైలజ తనిఖీ చేశారు.

ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీ

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోని ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బకాయిదారులకు ఊరట లభించినట్లయ్యింది. 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న పన్ను బకాయిలపై వడ్డీని 90 శాతం మాఫీతో మంచిర్యాల మున్సి పాలిటీలో రూ.2.15కోట్లు వడ్డీ మాఫీ కానుంది. మున్సిపాలిటీలో 26,718 ఇళ్లు ఉండగా, పన్ను వసూలు లక్ష్యం రూ.18.08 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.8.48 కోట్లు వసూలైంది. ఇంకా రూ.9.60 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. వడ్డీని 90 శాతం మాఫీ చేయడంతో ఇంకా రూ. 7.45 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. మార్చి 31లోపు చెల్లించిన వారికి మాఫీ వర్తించనుంది.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గొల్లవాడ కాలనీకి చెందిన గాదెం భీమయ్య (53) గురువారం రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. భీమయ్య తన గేదె ఇంటికి రాకపోవడంతో వెతుక్కుంటూ వెళ్లి గొల్లవాడ సమీపంలోని చీలపెల్లి రైల్వే అండర్‌బ్రిడ్జికి సమీపంలోని రైలు పట్టాలు దాటుతుండగా బల్లార్షా నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని భార్య గాదం లక్ష్మికి మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మేకను హింసించిన వ్యక్తిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మేకను హింసించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. పట్టణంలోని ఓల్డ్‌కాలనీకి చెందిన నరసింహ వరప్రసాద్ తన ఇంటిపక్కన ఉన్న వ్యక్తికి సంబంధించిన మేకను తన ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు వేసి మేకను హింసించాడు. దీంతో మేక అరుపులు విన్న యాజమాని వెళ్లి తలుపులు తట్టగా తీయకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు తీయించాడు. మేకను పరిశీలించగా వెనుక భాగంలో రక్తస్రావం జరుగుతోంది. మేక యాజమాని మహ్మద్ అజార్ ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి


రోజా (ఫైల్)

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని గన్నారం గ్రామ పంచాయతీలోని మండువ గ్రామానికి చెందిన కుమ్మరి రోజా (25) అనుమానాస్పదంగా మృతి చెందింది. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం రోజాకు ఐదేళ్ల క్రితమే వివాహంకాగా భర్తతో విడాకులు తీసుకుని తల్లిదండ్రులతో ఉంటోంది. బుధవారం వేరే గ్రామానికి వెళ్లిన తల్లిదండ్రులు గురువారం ఇంటికివచ్చి చూసేసరికి రోజా ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల వెతకగా పెరట్లో మృతదేహం కనిపించింది. తాము లేని సమయం చూసి గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని మృతురాలి తల్లి కమల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

మందమర్రి ఏరియాలో 90 శాతం బొగ్గు ఉత్పత్తి


వివరాలు వెల్లడిస్తున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలో ఫిబ్రవరి మాసంలో 90 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు ఏరియా జీఎం ఏ.మనోహర్ తెలిపారు. గురువారం బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. కేకే–5 గనిలో 16,578, కాసిపేట గనిలో 12,345, కాసిపేట2 గనిలో 8,399, శాంతిఖనిలో 6,016, ఆర్కే ఓసీలో 1,76,026, (117శాతం) కేకేఓసీలో 1,55,763 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి నెల రోజులు మాత్రమే సమయం ఉందని, సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రతీ ఉద్యోగి కంకణబద్ధుడై పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్కే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, డీవైపీఎం ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల 'పోస్ట్'

- తపాలా సేవలు విస్తరించినా మెరుగుపడని సౌకర్యాలు
- శిథిల భవనాల్లోనే కొనసాగింపు
- అధ్వానంగా ఉద్యోగుల క్వార్టర్లు
- ఎక్కడా కానరాని సీసీ కెమెరాలు
- అద్దె భవనాల్లో బ్రాంచ్ పోస్టాఫీసులు


బెల్లంపల్లి సబ్ పోస్టాఫీసు భవనం

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పోస్టాఫీసులు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దశాబ్దాలుగా సౌకర్యాల కల్పనకు నోచుకోవడం లేదు. పురాతన భవనాలు తప్పా కొత్త భవనాలకు మోక్షం కలగడం లేదు. అరకొర సౌకర్యాలు, అవస్థలతో పోస్టల్ ఉద్యోగులు అనివార్యంగా విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలకు పలు రకాల సేవలు అందిస్తున్న పోస్టాఫీసులను పట్టించుకునే వారే కరువయ్యారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సేవలను విస్తరించిన అధికారులు అందుకు తగిన సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

ఇవీ పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, మంచిర్యాలలో రెండు హెడ్ పోస్టాఫీసులు, వీటికి అనుబంధంగా 65 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా పక్కా భవనాలు లేవు. ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలిపోతాయో తెలియని పురాతన భవనాల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పైకప్పు ఊడి పోయి కింద పడుతున్న భవనాలకు దశాబ్దాల నుంచి తాత్కాలిక మరమ్మతులు చేయించడం తప్పా కొత్త భవనాల ఊసెత్తక పోవడంతో పోస్టాఫీసుల కళ మారడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎనిమిదింటికి పక్కా భవనాలు ఉండగా మిగతా వాటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న హెడ్ పోస్టాఫీసు భవనం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న పోస్టాఫీసు భవనం పరిస్థితి ఈ తీరుగా ఉంటే మిగిలిన వాటి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

సిబ్బంది క్వార్టర్లు

పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది కోసం పోస్టాఫీసు ఆవరణలో దశాబ్దాల క్రితం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా క్వార్టర్ల నిర్మాణం చేశారు. ఇరుకిరుకుగా గదులు ఉండడంతో జీవనం సాగించడానికి ఉ ద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఆడుకోవడానికి ఖాళీ స్థలం లేక నాలుగు గోడల మధ్య, టీవీల ముందు కాలం గడుపుతున్నారు. ఆట విడుపు లేక మానసిక వేదనకు గురవుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 525 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. వీటిలో దేనికీ సొంతగూడు లేదు. గ్రామాల్లో నివాసం ఉంటున్న పోస్టు మ్యాన్‌ల ఇళ్లలో, అద్దె భవనాల్లో వీటిని కొనసాగిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా వీటి రూపురేఖలు మారకపోవడంతో అత్యంత దయనీయస్థితిలో ఉన్నాయి. గ్రామాల్లో తపాలా సేవలు గతంలో కన్న ఎంతగానో విస్తరించినప్పటికీ సౌకర్యాలు లేక సిబ్బంది, గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు.

ఊసేలేని సీసీ కెమెరాలు

మారుతున్న కాలానికి అనుగుణంగా అన్నిరంగాల్లోనూ మార్పులు వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు ఇతర విభాగాల్లో తగినన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు జరిగే బ్యాంకులు, ఇతర సంస్థల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతగానో ఉంది. కానీ పోస్టాఫీసుల్లో ఆ ఊసేలేకుండా పోయింది. సీసీ కెమెరాల ఆవశ్యకతను తపాలా శాఖ గుర్తించడం లేదు. ఒక్కో పోస్టాఫీసులో రోజువారీగా కనిష్ఠంగా రూ.20 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.కోటి వరకు ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయినా ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోక పోవడంతో ఏదైనా ఘటన జరిగినా, అపరిచితులు పోస్టాఫీసు ప్రాంగణానికి వచ్చినా గుర్తుపట్టని పరిస్థితులు ఉన్నాయని పోస్టల్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వస్తోంది. అదేతీరుగా శిథిలావస్థకు చేరుకున్న భవనాలకు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పోస్టాఫీసులకు నిధులు మంజూరు చేయించి పక్కా భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల క్వార్టర్లకు తగిన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సమావేశం బహిష్కరించిన ఏఐటీయూసీ

నస్పూర్: ఎస్సార్పీ 1 గనిపై యాజమాన్యం శుక్రవారం నిర్వహించ తలపెట్టిన సేఫ్టీ కమిటీ సమావేశాన్ని ఏఐటీయూసీ నాయకులు బహిష్కరించినట్లు శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సమావేశంలో గుర్తించిన సమస్యలను యాజమాన్యం పరిష్కరించడంలో విఫలమైందని, ఇందుకు నిరసనగా నేటి సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని వారు పేర్కొన్నారు. గత సమావేశంలో గుర్తించిన సమస్యలు గని మేనేజరు వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాడి రాజయ్య, కామెర వేణు, మారెపల్లి బాపు, పరశురాములు, సేఫ్టీ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను గురువారం సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ బాలు నాయక్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బావురావుపేట గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 19 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను గుర్తించి సీజ్ చేసామన్నారు. పక్కనే ఉన్న ఒక ట్రాక్టర్‌ను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు నెలల ఫౌండేషన్ కోర్సు నిమిత్తం నిరుద్యోగ అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో భోజన వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇస్తున్నామని, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ(స్టాఫ్ సెలక్షన్ కమీషన్) నిర్వహించే ఉద్యోగ ప్రకటనలకు 100 మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించి ఉండరాదని, బీఏ/బీకాం/బీఎస్సీ/బీటెక్/(అగ్రి)/బీఫార్మసీ ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో www.tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 10న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 18 నుంచి జూన్ 17 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో ఎస్సీలకు 70 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 20 శాతం (మైనారిటీతో సహా), మొత్తం మీద 33.3 శాతం మహిళలకు, 5 శాతం దివ్యాంగులకు రిజర్వ్ చేయడం జరిగిందన్నారు. ఇంతకు ముందు ప్రభుత్వ శిక్షణ పొందిన వారికి అవకాశం లేదని, వివరాలకు 9441333348 నంబరులో సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రైవేటు ఆస్పత్రిలో మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం


మధునక్క (ఫైల్)



ఆస్పత్రి వద్ద పోలీసుల భద్రత

మంచిర్యాలటౌన్: చెన్నూరు పట్టణానికి చెందిన జోడు మధునక్క(45) మంచిర్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధునక్క కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా నాలుగు రోజుల క్రితం మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు బుధవారం సాయంత్రం ఆపరేషన్ చేశారు. అర్ధరాత్రి నుంచి ఆపరేషన్ జరిగిన చోట, చాతిలో నొప్పి వస్తుందని, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుందని చెప్పి ప్రాణాలు విడిచింది. వైద్యులు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో పోలీసులు ఆస్పత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబ సభ్యులు, వైద్యులతో చర్చించి వివాదాన్ని సద్దుమనిగేలా చేశారు. దీనిపై వైద్యుడు శ్రీనివాస్‌ను సంప్రదించగా ఆపరేషన్ విజయవంతంమైందని, ఆతర్వాత నొప్పిగా ఉందని చెప్పడంతో చికిత్స అందిస్తున్న సమయంలోనే హార్ట్ ఎటాక్‌తో మృతి చెందిందన్నారు. మృతురాలికి భర్త పోచం, ముగ్గురు కుమారులు ఉన్నారు.

మంచిర్యాలలో కిడ్నాప్... చెన్నూర్‌లో ట్రేసింగ్

- మూడుగంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని డీమార్ట్ సమీపంలో దంపతులను కిడ్నాప్ చేసిన సంఘటన గురువారం జిల్లాలో కలకలం రేపింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బియ్యాల రవి, గాయత్రి డీమార్ట్ సమీపంలో నిలబడి ఉండగా టీఎస్ 09 ఈఆర్ 9866 షిఫ్ట్ డిజైర్ కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు దంపతులను కిడ్నాప్ చేసి కారులో ఎక్కించుకుని వెళ్లారు. ర్యాలీకి చెందిన ఆటో డ్రైవర్ ఎండీ నాజర్ గమనించి మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో మధ్యాహ్నం 1:30 గంటలకు ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కారును వెంబడించి చెన్నూరు శివారు ప్రాంతంలో పట్టుకున్నారు. కిడ్నాపర్లను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో విచారించగా ఆశక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

గుప్త నిధులే కిడ్నాప్‌కు కారణమా?

కిడ్నాపర్లు దండేపల్లి మండలం వెల్గనూరు గ్రామానికి చెందిన గడికొప్పుల శ్రీనివాస్, మచ్చ సతీష్, గూడెం గ్రామానికి చెందిన చుంచు అజయ్, చెన్నూర్ మండలానికి చెందిన చల్ల స్నేహిత్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కిడ్నాప్‌కు గురైన రవి గతంలో గడిగొప్పుల శ్రీనివాస్‌తో పాటు మరికొందరి వద్ద గుప్త నిధులు చూపిస్తానని నమ్మబలికి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. గుప్త నిధుల విషయం తెలుపకపోగా తాము ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. అతనికోసం ర్యాలీ గ్రామానికి వెళ్తుండగా డీమార్టు సమీపంలో భార్యతోపాటు కనిపించడంతో ఇద్దరిని కారులో ఎక్కించుకుని వెళ్లినట్లు తెలిపారు.

అభినందించిన సీపీ

కిడ్నాప్‌కు గురైన వారిని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఫిర్యాదు అందిన మూడు గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకున్న మంచిర్యాల సీఐ రవీందర్, ఎస్సై జగదీష్, మహేందర్, స్పెషల్ పార్టీ సిబ్బందిని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు అభినందించారు.

'విలువైన భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేం'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ విలువైన భూములను ఇవ్వడానికి సిద్ధంగా లేమని గురువారం గుడిపేటకు చెందిన పలువురు రైతులు కలెక్టర్ సంతోశ్, ఆర్డీవో రాములు, హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. రహదారి విస్తరణలో భాగంగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన సర్వే నంబర్లలో తమ వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. గతంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు తమ భూములు ఇచ్చి నిర్వాసితులమైన తాము ఇప్పుడు జాతీయ రహదారికి మరోసారి భూములు ఇచ్చి బికారులం కాదల్చుకోలేదన్నారు. ప్రకటన ఉపసంహరించుకుని మా భూముల జోలికి రాకుండా చూడాలని కోరారు. కార్యక్రమాల్లో రైతులు కందుల రమేశ్, రాకేశ్, ధర్ని రాంబాబు, సత్తయ్య, తిరుపతి, ధర్ని రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాలఅర్బన్: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక చెన్నూర్‌రోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ నస్పూర్, మంచిర్యాలలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, 2002 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు, డీఏ విడుదల, పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారం మిగిలిపోయిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.లక్ష్మీనారాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సాంబయ్య, జిల్లా కార్యదర్శి వెంకటేశ్, మంచిర్యాల మండల అధ్యక్షుడు మురళీధర్ పాల్గొన్నారు.

కడెం.. డెడ్ స్టోరేజీ

- 3.116 టీఎంసీలకు చేరిన నీటి మట్టం
- గతేడాది 688.075 అడుగులు
- ప్రస్తుతం 677.475 అడుగులు


నీళ్లు లేక వెలవెలబోతున్న ప్రాజెక్ట్

కడెం: నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 68 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే కడెం ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరువైంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 7.603 టీఎంసీలు. ప్రస్తుతం 3.116 టీఎంసీలకు పడిపోయింది. వానాకాలం కడెం, దస్తురాబాద్, జన్నారం, దండెపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లో 68 వేల ఎకరాలకు సాగునీరు అందించింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో వర్షాలు కురవకపోవడం, ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడంతో నీటిమట్ట పడిపోయింది. యాసంగి పంటలకు నీరందించలేదు. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ క్రమంగా తగ్గుతూ డెడ్ స్టోరేజీకి చేరువైంది. గతేడాది ఫిబ్రవరి 28న, 688.075 అడుగుల నీటిమట్టం ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరి 28న 677.475 అడుగులుగా ఉంది.

యాసంగి బీడే..

వానాకాలంలో 68 వేల ఎకరాలకు సాగు నీరందించిన కడెం, యాసంగిలో కుడి, ఎడమ కాలువల ద్వారా కేవలం 25 వేల ఎకరాలకు సాగు నీటిని అందిస్తుంది. ఏడాది కంటే పది అడుగుల మేర నీటి మట్టం తగ్గడంతో ఈ యాసంగి పంటలకు సాగు నీరు ఇవ్వలేమని ప్రాజెక్ట్ అధికారులు ప్రకటించారు. బావులు ఉన్న రైతులు పంటలు సాగు చేయగా, కడెం నీటి విడుదల లేక వేల ఎకరాలు బీళ్లుగా మారాయి. కాలువలు, చెరువులపై ఆధారపడి పంటల సాగు చేసిన రైతులు సాగు నీటి కోసం తిప్పలు పడుతున్నారు. కడెం మండలం కన్నాపూర్, కొండుకూర్, బెల్లాల్, గ్రామ రైతులు కుడి కాలువపై ఆధారపడి పంటలు సాగు చేశారు. ప్రాజెక్ట్‌లో నీటి మట్టం పడిపోవడంతో కాలువ నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

భగీరథకు నీరందేనా?

మిషన్ భగీరథ పథకం ద్వారా కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాలకు నీరందించాల్సి ఉంది. మిషన్ భగీరథకు ప్రతీరోజు 09 క్యూసెక్కుల నీరు అవసరం. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ క్రమంగా తగ్గుతుండడతో మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్‌కు పూర్తి స్థాయిలో నీరందుతుందా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టెండర్లు పూర్తయ్యేనా?

కడెం మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం జనవరి 29న, రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. మొదటి సారి టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. రెండోసారి మళ్లీ టెండర్లు ఆహ్వానించారు. టెండర్ ప్రక్రియ ముగిసి వానాకాలం లోగా మరమ్మతులు పూర్తి చేస్తేనే కడెం ప్రాజెక్టు ఇబ్బందుల నుంచి బయటపడుతుంది. లేదంటే రెండేళ్లగా వానాకాలంలో వచ్చినట్లు భారీ వరదలు వస్తే ముప్పు తప్పదు. గతంలో విడుదల చేసిన రూ.కోటితో ప్రస్తుతం వరద గేట్ల కౌంటర్ వెయిట్‌లు, స్పిల్‌వే కింద భాగం మరమ్మతులు చేస్తున్నారు.

ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు(7.603 టీఎంసీ)
వరద గేట్లు 18
కాలువలు 2
ఆయకట్టు 68,150 ఎకరాలు(ఖరీఫ్)
డిస్ట్రిబ్యూటరీలు 42

నీటి మట్టం తగ్గుతోంది..



కడెం ప్రాజెక్టులో నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. డెడ్ స్టోరేజీ లెవెల్ 675 అడుగులు. ప్రస్తుతం 677 అడుగుల నీరు ఉంది. ప్రాజెక్టు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఇటీవలే ప్రభుత్వం రూ.5.46 కోట్లు విడుదల చేసింది. టెండర్ పూర్తి కాగానే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– భోజదాసు, కడెం ప్రాజెక్టు డీఈఈ

ప్రాజెక్టు అధికారిగా శ్రీనివాస్ బాధ్యతలు


శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

నస్పూర్: శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్టు అధికారిగా తాడెబోయిన శ్రీనివాస్ గురువారం ప్రాజెక్టు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన గనిపై ఉన్న మైసమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు, సెక్రటేరియట్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సుధీర్ జక్కులవార్, ప్రాజెక్టు ఇంజినీర్ చంద్రశేఖర్, రక్షణాధి కారి శ్రీనివాస్, సంక్షేమాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు తొమ్మిది స్థానాలు కేటాయించాలి

పాతమంచిర్యాల: పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు తొమ్మిది లోక్‌సభ స్థానాలు కేటాయించాలని బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సమావేశం నిర్వహించి రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖలు పంపించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల జనాభా 54.75 శాతం ఉందని, ప్రజాస్వామ్య వాటా ఇచ్చి మనోభావాలను గౌరవించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు బోడంకి మహేష్, శ్రీపతి రాములు, గుండా రాజమల్లు, కీర్తి భిక్షపతి, చంద్రగిరి చంద్రమౌళి, అంకం సతీష్ పాల్గొన్నారు.

'గురుకుల' ఫలితాల్లో ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన గణేశ్
- రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయినా.. ఆత్మస్థైర్యంతో ముందుకు


గణేశ్


బెల్లపు నగేశ్


అవినాశ్


అర్జున్


రజిత


కార్యం సుప్రియ

ఆదిలాబాద్‌టౌన్/తాంసి: కృషి, పట్టుదల ఉంటే అనుకున్నది సాధించవచ్చని నిరూపించారు జిల్లాకు చెందిన బోడ్కుంటవార్ గణేశ్, బెల్లపు నగేశ్, నడికుంట్ల అవినాశ్. గణేశ్ 2018లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కాలు కోల్పోయినప్పటికీ వెనుకడుగు వేయకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాడు. బుధవారం వెలువడిన గురుకుల డిగ్రీ ఫలితాల్లో ఆంగ్ల సబ్జెక్టుకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. బేల మండల కేంద్రానికి చెందిన ఈయన ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రభుత్వ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. గ్రూప్స్, సివిల్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో డిగ్రీ గురుకుల నోటిఫికేషన్ రావడంతో పరీక్ష రాశాడు. లెక్చరర్‌గా మరోసారి సర్కారు కొలువు దక్కించుకున్నాడు. తాంసి మండల కేంద్రానికి చెందిన బెల్లపు నగేశ్ డిగ్రీ లెక్చరర్‌గా, భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నడికుంట్ల అవినాశ్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. నగేశ్ ప్రస్తుతం మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని సైనిక్ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. నడికుంట్ల అవినాష్ సైతం గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లోప్ ప్రతిభ కనబరిచి ఎకనామిక్స్ విభాగంలో జూనియర్ లెక్చరర్ గా ఉద్యోగం సాధించాడు. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి బస్తీకి చెందిన దేవునూరి అర్జున్ ఎంకామ్, బీఈడీ పూర్తి చేసి గురుకుల టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ పోటీ పరీక్షలు రాశాడు. పీజీటీ సోషల్‌లో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు సాధించాడు. ఫిబ్రవరి 15న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రం అందుకున్నాడు. గురువారం వెలువడిన గురుకుల జూనియర్ కామర్స్ లెక్చరర్ ఫలితాల్లో టీజీటీ సోషల్‌లో 185 మార్కులు సాధించి లెక్చరర్‌గా రెండో ఉద్యోగం సొంతం చేసుకున్నాడు. అంతకు ముందు 2019లో గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఉద్యోగానికి ఎంపికై వారం రోజుల్లోనే రాజీనామా చేశాడు.

రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు

నిర్మల్ రూరల్: నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేట గ్రామానికి చెందిన మట్టి భూమన్న– రాజవ్వ ల కుమార్తె మట్టి రజిత గురువారం వెలువడిన గు రుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ప్రభుత్వ జూ నియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. కొన్ని రోజుల క్రితం వెలువడిన పీజీటీ ఫలితాల్లోనూ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ ఉద్యోగం కూడా సాధించింది. ఒకే నెలలో రెండు ఉద్యోగాలు రావడంతో ఆ నందంగా ఉందని రజిత పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలలో చదివి, తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో విజయం సాధించానని రజిత తెలిపారు.

మెడన్‌పూర్ యువతి..

కుంటాల: మండలంలోని మెడన్‌పూర్ గ్రామానికి చెందిన కార్యం సుప్రియ గురుకుల నియామక బో ర్డు వెల్లడించిన ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే జూనియర్ లెక్చరర్, పీజీటీ ఉద్యోగాలకు ఎంపికైంది. ఇంగ్లిష్ సబ్జెక్టులో రెండు ఉద్యోగాలు సాధించింది. తన మామయ్య కార్యం పెద్దరాజన్న, భర్త రాజు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధ్యమైందని కార్యం సుప్రియ తెలిపారు.